కథ

# తల్లీ నిన్ను దలంచి

పాలగుమ్మి రామకృష్ణారావు

"పైడమ్మా పాపగారొచ్చారు." గట్టిగా అరచి అక్కడే మట్టి అరుగుపై తుండుతో దులిపి చతికిలబడ్డాడు సింహాద్రి. రాత్రి మామిడి తోటకు కాపలాకెళ్ళినవాడు ఇప్పుడే తిరిగొస్తూ ఈ కబురు మోసుకొచ్చాడు.

పైడమ్మ గదిలోంచి ఒక్క వుదుటన బయిటకొచ్చి చుట్టూ కలయ చూసి "ఏరి పాపగారు?" అంది. వెనుకనే వచ్చిన మహాలక్ష్మి తల్లి కొంగు పట్టుకు లాగుతో "ఎవులమ్మా?" అంది.

సింహాద్రి గట్టిగా నవ్వాడు. "మనింటికి కాదెయ్. మునసబుగారింటికి. నేనా ఈదిలోంచొస్తోంటే అగుపడింది."

పైడమ్మకు మనసు నిలకడ తప్పింది. "ఇప్పుడే చూసొత్తా." అంటూ పైటతో మొహాన్ని గట్టిగా తుడుచుకుంది.

"మరి నేనో-" అంది మహాలక్ష్మి.

"నువ్వు పుట్టినాకా పాపగారు నిన్ను చూడలేదు. చూపిస్తాను దా." మహలక్ష్మిని ఎత్తుకుని ముద్దు పెట్టుకుంది.

"బేగొచ్చెయ్. ఆలీసం చెయ్యకు" అన్నాడు సింహాద్రి పైడమ్మ ఇంక ఆగదని తెలిసి.

"వొస్తాలే. చల్దన్నం కంచంలోనే వుంది తినెయ్" ఆగకుండా అడుగులు ముందుకు వేసింది పైడమ్మ.

మునసబుగారింటికి వెళ్ళాలంటే నాలుగు వీధులు దాటాలి. మెయిన్ రోడ్డుకు దగ్గరగా వుంటుంది. వీధిగోడకానుకుని ముందూ వెనుకా అరుగులు, లోపల నాలుగు కొబ్బరి చెట్లతో కొంచెం ఖాళీ స్థలం, అందులో ఎదురెదురుగా రెండు సిమ్మెంటు బెంచీలు, ఇంటి మధ్యలో పెద్ద సింహ ద్వారం, చూడ్డానికి చాలా అందంగా వుంటుంది ఆ ఇల్లు. తన చిన్నతనంలో ఆ ఇల్లును చూడ్డానికే రోజూ తల్లి మంగమ్మతో కలసి వెళ్ళేది. మంగమ్మ ఇంటి పని చేస్తోంటే వెనగ్గా తల్లి కొంగు పట్టుకుని ఇల్లంతా తిరిగేది.

ఒకరోజు అలా తల్లివెంట వెళ్ళి పెరటి బావి దగ్గరా, పసువులకొట్టంలోనూ తిరుగుతోంటే, వెనుక వంటింటి గుమ్మం తలుపునానుకుని, రెండు జళ్ళతో, పట్టుపరికిణీలో మరో అమ్మాయి కనపడింది. ఆ అమ్మాయి కూడా తనకేసి కొత్తగా వింతగా చూస్తోంటే "ఎవులే అమ్మా పాప?" అనడిగింది తల్లిని.

మంగమ్మ నవ్వుతో చెప్పింది. "మన పాపగారేయ్. మున్సెబుగారి అమ్మాయిగోరు సుందరమ్మ గారి పాప. రాత్రొచ్చినారుగాల్న."

మరో పది నిముషాలకు సుందరమ్మగారితో పాప కూడా గుమ్మం దాటొచ్చింది. పైడమ్మ నవ్వితే తనూ నవ్వింది. అరగంటలో ఇద్దరూ స్నేహితుల్లా పెరటి తోటలో చెట్ల కింద ఆటలాడుకున్నారు. అప్పుడు మునసబు గారి ఇల్లు కన్నా పాప ముఖ్యమయిపోయింది పైడమ్మకు. పాప వున్న నెలరోజులూ రెండుపూటలా వచ్చింది. పాపకు తనకు తెలిసున్న ఆటలు నేర్పింది. తను పాప దగ్గరనుండి తల దువ్వుకుని జడేసుకోవాలని, బట్టలు సుభ్రంగా వుండాలని ఎన్నో నేర్చుకుంది. సుందరమ్మ గారిచ్చిన పాప పాతబట్టలు ఎంతో ఆప్యాయంగా కట్టుకుంది. "ఓలమ్మో పాపమ్మగార్ని చూసి ఎన్ని నేర్చేసుకుందో మన గుంటది!" అని ఆశ్చర్యపోయేది మంగమ్మ.

పాప ఊరెళ్ళిపోయే రోజున పైడమ్మ అదేపనిగా ఏడ్చింది. పాప కూడా అంతే. "పాపగోరు మళ్ళొస్తారులేయే" అంది మంగమ్మ కూతురు ఏడుపు ఆపించడానికి. అప్పుడే సుందరమ్మగారు ఒక మాటన్నారు. "పైడమ్మా ఒక మాట అడగాలనుకుంటున్నాను, ఏం అనుకోవుగదా?"

"అనుకోటానికేంది. చెప్పండమ్మా"

"నేనూ, మా వారు ఆఫీసుకు వెళ్ళిపోతే మా పాపను చూసుకోవడానికి ఇంతవరకూ బేబీ కేర్ సెంటర్లో పెట్టాం. ఇకనుండి కాన్వెంటుకు పోయొస్తుంది. స్కూల్ బస్సు ఇంటి దగ్గర దింపే సమయానికి మేం ఆఫీసునుండి తిరిగి రాము. అందుచేత ఇంటిలో వుండే మనిషిని చూసు

కుంటున్నాం. మా బెంగళూరులో మనుషులు దొరుకుతారనుకో. కానీ పాప ఫైడమ్మంటే ఇష్టపడుతోందని అడుగుతున్నాను. ఫైడమ్మను మాతో పంపుతావా?''

మంగమ్మ కంట్లో నీళ్ళు తిరిగాయి. ''కష్టంకదమ్మగోరు. ఈ గుంటది మా కాడ్న లేకుండా వుండలేం కదమ్మా.''

''నేదు, నేను పాపగారితో ఎల్లిపోతా–'' రాగం అందుకుంది ఫైడమ్మ.

''దాని బట్టలు, తిండి అన్నీ మేమే చూసుకుంటాం. నెలకు వెయ్యి రూపాయలు జీతం కూడా నీ ఇంటికి పంపుతా, సరేనా! బాగా ఆలోచించు మంగమ్మా''

''దాని అయ్యోప్పుకోవాలి గదమ్మా'' కొంచెం మెత్తబడింది మంగమ్మ.

''అలాగే. ఆలోచించుకునే చెప్పండి. ఈ రాత్రికే మా ప్రయాణం.'' అంది సుందరమ్మ.

మంగమ్మకు మనస్థిమితం తప్పింది. కూతుర్ని బలవంతంగా ఇంటికి ఈడ్చుకెళ్ళిందికానీ దారి పొడుగునా అది రానని ఏడుస్తోనే వుంది. ఇంటికి రాగానే పెనిమిటి అప్పన్నకు విషయం చెప్పింది. ''సుందరమ్మగోరు మన ఫైడమ్మను ఆరితోబాటు పంపమంటున్నారు. నెలనెల వెయ్య రూపాయిలిస్తారంట''

అప్పన్న కూడా మొదట కాదన్నాడు. రెండు మూడుసార్లు అదే విషయాన్ని ఇద్దరూ నెమరువేసుకున్నాకా, ఉదయం నుండి ఫైడమ్మ కూనిరాగాలు చూసి ''ఆ గుంటకిష్టమే కదా! బాగా చూసుకుంటామంటున్నారు. జీతం కూడా ఇస్తామంటున్నారు. మన మునసబుగారి అమ్మాయింటికే కదా పంపేది! పంపితే పోయిందేంటి?'' అనుకున్నారు చివరికి.

''మనం మట్టి మనుషులమే. పొద్దుగేలనుంచి సాయింత్రం వరకూ మట్టి పిసుక్కుంటూ నేను, అంట్లు తోముకుంటూ నువ్వూ రోజులు గెంటేస్తున్నాం. పోన్లే ఆళ్ళు సుకపెడతానంటే దాన్నేనా సుకపడనిద్దాం'' అన్నాడు అప్పన్న.

''మరి మంచీగా అయ్యకోసం, అమ్మకోసం ఏడవమాకుండా వుంటావా?'' అడగింది కూతుర్ని మంగమ్మ తన ఇష్టాన్ని ఆ రకంగా బయటపెట్టి, ఫైడమ్మ ఏడుపు అపుచేసింది. కళ్ళు నులుముకుంటూ 'ఉంటా' అని తల ఆడించింది.


''పాపగోర్ని మంచిగా చూసుకోవాలి. ఆమ్మగోరు, అయ్యగోరు ఏవన్నా ఏడాకూడదు మరి. అయ్యకావాలి, అమ్మ కావాలి అంటే అప్పుడు లగెత్తుకు రాము. అన్నీ ఆరే నీకు. ఇష్టవేనా మరి?'' అడిగాడు అప్పన్న. ఫైడమ్మ గుడ్లప్పగించి అయ్యకేసి చూసింది.

''అయ్యడిగిందానికి సెప్పాలి. ఆట్లా గమ్మునింటే ఏం చేత్తాం! దూరాలు దూరాలు పోయినాక ఏయాలపడితే ఆ యాల మేం ఆగుపడం కదా. అక్కడ మంచిగుంటనంటే పంపుతాం.''

''పాపతో మంచిగుంటాను.'' ఈ సారి ఆలస్యం చెయ్యకుండా ముక్కెగరేస్తో చెప్పింది.

''అట్లయితే ఎల్లుగాన్లే. ఏడామాకు.'' అన్నాడు అప్పన్న.

ఫైడమ్మ చెంగున ఇంట్లోంచి బయిటకు వురికింది. ఇంటికి దగ్గరగా వున్న చెరువు గట్టు దగ్గరకు పరుగెత్తింది. చెరువులో చేప పిల్లలు పైకి గాల్లోకెగిరి నీళ్ళలో పడుతోంటే చూసి చప్పట్లు కొట్టింది. 'రేపిక్కడ వుండనుగా. రేపటినుంచి ఎగిరే చేపలు కనపడవు' అనుకుంది వాటిని ఆప్యాయంగా చూస్తో. నాలుగు బిళ్ళ పెంకులు చేతులోకి తీసుకుని వాలుగా చెరువులోకి విసిరింది. అవి నీటి



మీద కప్ప దూకుళ్ళు చేస్తో చాలా దూరం పరుగెత్తాయి. 'ఈ ఆట కూడా ఇంక వుండదు' అనుకుంది ఫైడమ్మ. కాసేపక్కడే కూర్చుని ఏదో జ్ఞాపకం వచ్చిన దానిలా వీధిబడి దగ్గరకు పరుగెత్తింది. పంతులుగారు పాఠం చెబుతున్నారు. పిల్లలు ఆయనతో బాటు పాఠం గట్టిగా చదువుతున్నారు. బడి వెనుక వెదురు గోడకు వున్న కంత నుంచి చూసింది. రోజూ రకరకాల పాటలు పాడిస్తారు పిల్లల చేత. 'రేపటినుంచి ఈ పాటలుండవు' అనుకుంది బాధగా. అంతలోనే ధైర్యం వచ్చింది. 'పోనీ. పాపగారున్నారుగా. ఇంతకన్నా మంచి పాటలు చెబుతారు.' అక్కడినుంచి లేచి తనకు బాగా అలవాటున్న శివాలయం, సెట్టి కిరాణా షాపు, చాకలి రేవు కూడా ఒక సారి చూసి ఇంటికి తిరిగొచ్చింది. పెద్దమ్మగారితో వెళ్ళేటప్పుడు సంచీలో బట్టలు పెడితే బాగుండదని యాభై రూపాయలు పెట్టి జిప్ బాగ్ కొనుక్కొచ్చాడు అప్పన్న. ఫైడమ్మ బాగ్ చూసి మురిసిపోయింది. ఆ ఇంట్లో తనకంటూ ప్రత్యేకంగా కొన్నవస్తువది. బాగ్‌కు ముందో అరుంది. అటు, ఇటు రెండరలున్నాయి. జిప్పు రెండు మూడు సార్లు లాగి చూసింది. ''ఈ పక్కాట్లో ఏం పెట్టుకోవలమ్మా?'' అడిగింది తల్లిని.

మంగమ్మ కూడా ఆ అరలను చూసి మురిసిపోయింది. ''ఏటైనా పెట్టుకోచ్చే. నీ రిబ్బన్లు, పిన్నులు, దువ్వేని అన్నీ ఈట్లోనే పెట్టుకు దాసుకోచ్చు. డబ్బులు ఆడ ఈడ పారైమాక. ఈట్లో పెట్టి దాసుకో. దీనికి తాలముంటదా? అఆ- పెట్టేతే మగడా అంటే ఈ సోకు బేగ్గు తెచ్చేసినాడు, కూతురందానికి తక్కువైపోతాదని.''

అప్పన్న చిరాకు పడ్డాడు. ''తాలముంటాదోస్. చిన్న తలం బుర్రిచ్చిన్నాడు. ముందరలో ఏసినా చూడు.''

ఫైడమ్మ సుందరమ్మగారిచ్చిన పాతబట్టలన్ని ముందరేసింది.

''పోయిన సంకురేతికి సంతలో కొన్న పువ్వుల్లంగేస్కోవా!'' బట్టలవంక చూస్తో అడిగింది మంగమ్మ.

ఫైడమ్మ తల అడ్డంగా తిప్పింది. ''నాకదొద్దే అమ్మా. పువ్వులంగా గరుగ్గుంటాది. ఇయ్యేమో సిల్కీయి. పాపగోరి బట్టలే బాగుండాయి.'' మంగమ్మ బలవంతపెట్టలేదు. బట్టలన్నీ బాగ్‌లోకి సర్దిపెట్టింది. మరో అరలోకి దువ్వెన్న, చిన్న అద్దం, రెండు రిబ్బన్లు, తిలకం సీసా వేసింది. ఫైడమ్మ పట్టలేని ఆనందంతో గంతులేసింది. ఐసు బండివాడు రోడ్డుమీద అరుస్తోంటే ''ఇట్రా అబ్బీ'' అని పిలిచాడు అప్పన్న. ''నాకేనా!'' అంది ఫైడమ్మ తండ్రి భుజాలమీదికెక్కి. ''రెండయిసీలియ్.'' ''రెండా!'' మళ్ళీ ఆశ్చర్యపోయింది ఫైడమ్మ. ఐసు బండబ్బాయి రెండయిసులూ రెండు చేతుల్లో పెట్టాడు. మంగమ్మ పిల్లకిష్టమైన మరమరాలుండలు తెచ్చిపెట్టింది. సాయింత్రం కాగానే ఫైడమ్మను భూమ్మీద నడవనీకుండా అప్పన్న ఎత్తుకుని, మంగమ్మ బేగ్ పట్టుకుని మున్సబుగారింటికి తీసుకొచ్చారు. ఫైడమ్మను చూడగానే పాప మొహం కూడా పెద్దదయింది. ఇద్దరూ చేతులు ఫైడమ్మను పంపుతోన్నందుకు చాలా సంతోషించారు. తెలుసున్న మనిషి, పాపకు ఈడైనది ఇంట్లో వుంటే ఇంకేం బాధలేదనిపించింది వాళ్ళకు. ''మీ చేతుల్లో పెడుతున్నాం బాబూ ఎట్టా సూసుకుంటారో!'' అన్నాడు అప్పన్న. ''ఎప్పుడూ పిల్లదాన్ని వదిలుండలేదయ్యా'' పైటకొంగును రెండుచేతుల మధ్య పెట్టుకుని దండం పెట్టింది.

మునసబుగారి అల్లుడు ధైర్యం చెప్పాడు, ''మేం కొత్తవాళ్ళం కాదుకదా? ఎందుకు భయం? ఇప్పుడు వాళ్ళిద్దరూ ఎలా ఆడుకుంటున్నారో చూడండి. ఇంటికి వెళ్ళాకా కూడా అలాగే సంతోషంగా వుంటుంది మీ పిల్ల. ముందు ఈ వెయ్యి రూపాయలు ఉంచుకోండి. ఫరవాలేదు తీసుకొండి. ప్రతినెలా పంపుతాను. నా దగ్గరనుండి డబ్బురాకపోతే మా మావగార్ని అడిగి తీసుకొండి. సరేనా.''

ఇద్దరూ కాస్త స్థిమిత పడ్డారు. పట్నంలో వున్న రైల్వే స్టేషన్ వరకూ కార్లో వెళ్ళారు. కార్లో కూచుంటే ఫైడమ్మ గొప్పవాళ్ళ పిల్లనిపించింది వాళ్ళకు. స్టేషన్‌లో రైలొచ్చే వరకూ ఫైడమ్మను చంకనేసుకుంది మంగమ్మ. ఎలా వుండాలో ఏంటో తన తెలివికొచ్చిన మాటలన్నీ చెప్పింది. రైలు రాగానే అందరూ ఎక్కాకా చివరగా ఒక ముద్దిచ్చి ఫైడమ్మను చంకలోంచి రైలు బోగీ గుమ్మంలోకి మార్చింది. పాప, ఫైడమ్మ కిటికీ పక్కన కూర్చున్నారు. రైలు అక్కడున్న రెండు నిమిషాలు పాపతో బాటు ఫైడమ్మ కూడా 'టాటా' అంటూ చెయ్యి ఊపింది. రైలు కదిలాకా ఫైడమ్మకు కళ్ళనీళ్ళు తిరిగాయి. రైలు అయ్యా అమ్మలకు దూరంగా లాక్కుపోయింది. సుందరమ్మగారు భుజం మీద చెయ్యేసారు. ''ఏంటి ఫైడీ ఏడుస్తున్నావా? నీ ఫ్రెండు పాప వుంది కదమ్మా. ఏడవకు. మళ్ళీ వస్తాంగా!'' ఒక పది నిముషాలు అనునయంగా మాట్లాడాకా ఫైడమ్మ తేరుకుని పాపతో ఆటల్లో పడింది.

బెంగళూరు వెళ్ళాకా ఫైడమ్మ జీవితం చాలా మారిపోయింది. తను కలలో కూడా ఊహించని సుఖాల్ని అనుభవించింది. సుందరమ్మ శుచి, శుభ్రత నేర్పింది. పనిమనిషని ఆలోచన లేకుండా తన కూతురితోబాటు సమానంగా చూసుకుంది. ఫైడమ్మ తనంత తను చేసుకునే పనులు వచ్చే వరకూ తల్లిలాగే సహాయం చేసింది. ఏనాడు అయ్యా, అమ్మల గురించి ఏడ్చే అవకాశం రానీయలేదు.

సుందరమ్మ ఇంటిపనులు చేసుకుంటోంటే కొద్దిగా చేతిసాయం అందిచడమే ఫైడమ్మ పని. ప్రొద్దుట ఎనిమిది గంటలకు పాప కాన్వెంటుకు వెళ్ళే లోగా టిఫెన్ బాక్స్ కడిగి, బూట్లు పాలిష్ చేసి, డ్రస్సు అలమారలోంచి తీసి, పాప ఇచ్చే పుస్తకాలన్నీ బాగ్‌లో సర్ది పెద్దమ్మగారికి సహాయంగా వుండేది. పాప కాన్వెంటుకు వెళ్ళిన మరో గంటకు అమ్మగారు, అయ్యగారు ఆఫీసుకు వెళ్ళిపోయేవారు. ఆ తరువాత అంతా స్వేచ్ఛే. ఇంటి తలుపు వేసుకుని హాయిగా పాప బొమ్మలతో ఆడుకోవడం, ఆకలేస్తే అన్నం తినడం, టీవీలో కార్టూన్ ఛానల్ చూడ్డం, అప్పుడప్పుడు కిటికీలోంచి బాహ్య ప్రపంచాన్ని చూస్తో కూర్చోవడం-

మధ్యలో ఒకటి రెండు సార్లు సుందరమ్మ ఆఫీస్ నుండి ఫోన్ చేస్తో 'అన్నం తిన్నావా? పోష్టమాన్ వచ్చాడా? జాగ్రత్తగా కిటికీలోంచే తీసుకో. తలుపు తీసి బయటకు వెళ్ళకు, నిద్ర పోకు, పాప వచ్చిందా? పాపకు ఫ్రిడ్జ్ లోంచి బాదం మిల్క్ తీసియ్యి' అంటూ జాగ్రత్తలు చెప్పేది.

ఫైడమ్మకు ఈ జీవితం చాలా నచ్చింది. మెత్తటి పరువుల సౌఖ్యాన్ని చూసింది, చల్లటి ఏసి గాలుల్ని అనుభవించింది. వంటికి మట్టి అంటే



పనిలేదు. పాప ఇచ్చే పాత బట్టలే కాదు కొత్త బట్టలు కూడా కొంటున్నారు. ఆదివారాలు వాళ్ళ ముగ్గురితో షికార్లు వెళ్తోంది, సినిమాలు చూస్తోంది. సంవత్సరానికోసారి స్వంత ఊరు వచ్చి పది రోజులు ఇంటిదగ్గర మట్టి నేలలో, దోమల మధ్యన అతి కష్టంగా వుంటోంది.

పాప ఇంగ్లీషు మాటలు నేర్పింది పైడమ్మకు. బట్టలు నలక్కూడదని, చెప్పులు వేసుకోకుండా తిరక్కూడదని ఇంకా ఎన్నో నేర్పి పైడమ్మకు గురువయింది.

రోజూ ఉదయం తొమ్మిది గంటలనుండి సాయంత్రం మూడు గంటల వరకూ పైడమ్మ ఆ ఇంటిలో వుండే ఏకైక మహారాణిలా జీవితం గడుపుతోంది. మూడు గంటల తరువాత పాపకోసం ఎదురు చూసేది. పాప సాయింత్రం నాలుగు గంటలకు ఇంటికి వచ్చే సమయానికి బాత్‌రూంలో టవలు పెట్టి గీజరు ఆన్ చేసేది. పాప స్నానం చేసి రాగానే ఫ్రిడ్జ్‌లో పెట్టిన స్నాక్స్, ఏదో ఒక జ్యూస్ టేబిల్ మీద వుంచేది. పాపతో బాటు తనుకూడా తినేది. ఆ తరువాత కాసేపు ఇద్దరూ కేరమ్స్ ఆడుకునేవారు. ఒక గంట గడవగానే పాప ఆటను ఆపు చేసి "ఇంక నేను చదువుకోవాలి ప్లీజ్. బోల్డు హోం వర్కు రాసుకోవాలి. నన్ను డిస్టర్బ్ చెయ్యకు" అనేది.

"అలాగే పాపగారు. నాకు వేరే పనుందిగా. ఈ ప్లేట్లు గ్లాసులు క్లీను చేసేస్తాను, ఇల్లు ఊడ్చేస్తాను, బయట గుమ్మం దగ్గర నీళ్ళు చల్లి ముగ్గు పెట్టేస్తాను" అంటే పాప ఆశ్చర్యపోయేది.

"ఇన్ని పనులు ఎలా చెయ్యగలవు? నాకసలు ఒక్కటి కూడా రాదు"

"మా అమ్మ కూడా వుండి ఇవన్నీ తెలుసుకున్నాను. మీ అమ్మగారు కూడా నాకు అన్నీ నేర్పిస్తారు." పైడమ్మ సంతోషంగా చెప్పేది. పాపకు రాని పనులు తనకు బోలెడు తెలుసన్న సంతోషం.

చెయ్యవలసిన పనులన్నీ ఒక గంటలో చేసేసి మళ్ళీ వచ్చి పాప పక్కన కూర్చునేది. పాప హోం వర్కు రాసుకుంటోన్నా, పుస్తకాలు ఇంగ్లీషులో గడగడ చదివేస్తున్నా పాప చేతి కదలికలకేసి, అటూ ఇటూ జరిగే కనుగుడ్లకేసి వింతగా చూస్తో కూర్చునేది.

'ఏంటి చూస్తున్నావు?' అంటే "మీరు అందంగా రాస్తున్నారు. అంత స్పీడుగా ఎలా చదువుతారు పాపగారు?" అనేది. పైడమ్మ తన పని గురించి తేలిగ్గా సమాధానం చెప్పినట్లుగానే తేలిగ్గా నవ్వి వూరుకునేది పాప.

"నేను రాస్తే ఇలా వస్తాయా?"

"కష్టం. రోజూ రాసిరాసి, నా చేతులు లాగి లాగి ఇప్పటికిలా వచ్చాయి."

"నేనూ రోజూ రాస్తే వస్తాయా?"

"ఊహు."

"ఎందుకని?"

"అదంతే. నువ్వు రోజూ నాలాగ స్కూలుకు వెళ్ళవుగా. అన్నేసి గంటలు స్కూల్లో రోజూ కూర్చుంటే వస్తాయి."

"నేనూ స్కూలుకొచ్చెయ్యనా పాపగారు?"

"ఎలా? బోల్డు ఫీజు కట్టాలి."

"ఎంత?"

"లక్ష రూపాయలు."

"వా అమ్మో! అంత డబ్బా! మీరు పుస్తకం చూసి చెప్పండి పాపగారు. నేను ఇక్కడనే చదువుకుంటా."

"నువ్వు చదువుకుంటూ కూర్చుంటే ఇంట్లో పనులెవరు చేస్తారు?" పైడమ్మ ప్రశ్నలు ఆగిపోయేవి.

"సారీ పైడమ్మా నీకు చెప్పేంత తెలివి నా దగ్గర లేదు. నేను చదువుకోవడానికి టైముండాలి కదా! చిన్న చిన్న రైమ్స్, ఇంగ్లీష్ అక్షరాలు, మాటలు చెప్పగలను. సాయింత్రం మన ఆటల్లో రోజూ అవన్నీ నీకు చెబుతాను. వచ్చేస్తాయి,

మ్మకు ఏడుపొచ్చింది. "వెళ్ళక తప్పదా పాప గారు?" అంది రెండు చేతులు పట్టుకుని.

పాపకు పైడమ్మ బాధ అర్థమయింది. ఆ ఇంట్లో పది సంవత్సరాలనుండి తనతో కలిసి ఆడుకుంది, తన పరిధిలో చదువుకుంది, నిత్యం



## ఆదాయం అడగొద్దు ప్లీజ్...

మగవాళ్ళ ఆదాయం, ఆడవారి వయస్సు అడగకూడదంటారు. కానీ జెనీలియా మాత్రం రివర్స్‌లో వస్తోంది. తన సంపాదన ఎంత అన్నది చెప్పమంటే మాత్రం తెలివిగా లెక్కలు చూపుతోంది. చూపులకి చిన్నదే అయినా సంపాదనలో మాత్రం పెద్దదే! అదేనండి మన హాసిని(జెనీలియా). వెండితెర మీదే కాకుండా యాడ్స్‌లో కూడా నెంబర్ వన్‌గా ఉన్న జెనీలియా సంపాదన చాలా మంది హీరోయిన్ల కన్నా ఎక్కువే! అయితే...."ఎవరైనా నన్ను, ఎంత సంపాదిస్తున్నావు? అని అడిగే కన్నా, ఎన్ని మంచి పనులు చేస్తున్నావ్ అంటే ఎక్కువగా సంతోషిస్తాను. నేను ఎంత సంపాదించినా, అందులో సగభాగం మంచి పనులకే(అవేంటో చెప్పుకోవడం ఇష్టం ఉండదట!)ఖర్చు చేస్తాను. కాబట్టి మిగతా వారితో పోల్చుకుంటే నా సంపాదన తక్కువే" అంటూ తెలివిగా, తన ఆదాయం ఎంతో చెప్పకుండానే చెబుతోంది.

సరేనా!" ఆ రోజుకు అక్కడితో సరేనన్నట్లు తలూపేది.

పైడమ్మ పాప దగ్గర మరో రోజు మరో ప్రశ్న లేవదీసేది.

"పాపగారు ఇలా ఎన్నాళ్ళు చదువుతారు?"

"మా డాడీ చెప్పారు ట్వంటీ క్లాసెస్ చదవాలని."

"అంటే ఇరవై కదమ్మా?"

"నీకు ఇంగ్లీషు వచ్చేస్తోంది పైడీ!"

ఆ మాటకు పైడమ్మ మొదట సిగ్గు పడేది, తరువాత గర్వపడేది. ఒక్క నిజం మాత్రం గ్రహించింది– తను చదువుకుంటే పాపలాగే తనకూ చదువు వస్తుంది. దేవుడు తనకు అవకాశం ఇవ్వలేదు. 'పోనీలే. దేవుడు ఈ మాత్రం సుఖాన్నిచ్చాడు. అమ్మా అయ్యలకు తనద్వారా ఆధారాన్నిచ్చాడు' అని సంతృప్తి పడింది.

పాప ఒక్కొక్క క్లాసు మెట్టు ఎక్కుతోంది పైడమ్మ ఇంటిపని, వంటపనీ అన్నీ నేర్చుకుంది. దానితోపాటు జీవితానుభవం సంపాదించుకుంది.

పాప పన్నెండు క్లాసులు పూర్తిచేసి డిగ్రీ మరో ఊర్లో చదువుకోవడానికి సీటొచ్చినప్పుడు పైడ

తన పనులకు ఘహాయంగా వుంది. ఇప్పుడు తను లేకుండా ఒంటరిగా వుండలేననే బెంగ పట్టుకుంది. "చూడు పైడీ మా మమ్మీడాడీలు నన్ను ఎంతో హేపీగా పంపుతున్నారు. నేను కూడా చదువుకోవాలని హేపీగా వెళుతున్నాను. నువ్వేమో కళ్ళ నీళ్ళు పెట్టుకుంటున్నావు."

"చదివింది చాలదా? ఇంకా చదువుకోపోతే ఏంటి పాపగారు?"

"చాలదు. ఇంకా చదువుకోవాలి. చదువుకోకపోతే మా మమ్మీ , డాడీలా పెద్ద ఉద్యోగం ఎలా వస్తుంది?"

పైడమ్మ అర్థం చేసుకుంది. కళ్ళు తుడుచుకుంది. పెదాలపై నవ్వు తెచ్చుకుంది. పాపతో ఆటలాడడం అనే సుఖం కోసం అమ్మా అయ్యల్ని వదిలి ఇంత దూరం వచ్చింది తను. డబ్బున్న వాళ్ళ జీవితాలలో సుఖాల్ని తనూ అనుభవించి ఇంతకాలం ప్రపంచాన్ని మరిచి జీవించింది. తన లాగే పాప ఇంతకన్నా మంచి సుఖాన్ని ఆశించి దూరం వెళుతోంది. ఎవళ్ళ జీవితం వాళ్ళది అని సమాధానపడింది.

పాప వెళ్ళిపోయాకా ఇంట్లో చేసే పనులు తగ్గి

పోయాయి. పగలు ఒంటరిగా అనుభవించే మెత్తటి పరువులు, ఏసిలు, టీవీ బొమ్మలు సుఖాన్నివ్వడం తగ్గించేసాయి. తనకేదో కావాలి. తను ఏదో పోగొట్టుకుంటోంది. పైడమ్మ ఎంత ఆలోచించినా అదేవిటో అంతుబట్టలేదు. రోజూ చేసే పని నిముషాల్లో అయిపోతోంది. ఇంట్లో పగలు ఒంటరి జీవితం భయపెడుతోంది.

అప్పుడే తల్లి మంగమ్మ రాయించిన ఉత్తరం వచ్చింది. పైడమ్మకు పెళ్ళీడొచ్చిందని, మనువాడ్డానికి మేనమామ సిద్ధంగా వున్నాడన్న సంగతి ఉత్తరం మోసుకొచ్చినప్పుడు, ఇంక పైడమ్మతో అంత పనేం లేదులే అని అయ్యగారు, అమ్మగారు అనుకున్నప్పుడు పైడమ్మను రైలు వెనక్కు తీసుకొచ్చింది.

అయ్యగారు, అమ్మగారు చాలా మంచి వారు. పైడమ్మ పెళ్ళికి కావలసిన కొత్త బట్టలు కొనిచ్చారు. మంగళ సూత్రం వాళ్ళే చేయించారు. పెళ్లి బాగా చెయ్యండని ఇరవై వేలు నగదు కూడా ఇచ్చారు. ఇంతకన్నా ఎవరేం చేస్తారు అనుకున్నారు అప్పన్న, మంగమ్మ.

పెళ్ళితో గత సుఖాలకు దూరమైనా కట్టుకున్న వాడితో కొత్త జీవితం గతాన్ని జోకొట్టింది. సింహాద్రి మంచివాడు. అక్షరాలు తెలిసిన పైడమ్మ మీద అంతులేని ప్రేమ కురిపించాడు. పైడమ్మ కోరుకున్నదేదైనా ఉన్నంతలో అమర్చేవాడు. అలాగని పైడమ్మ మేడలు, ఏ.సి.లు కోరలేదు. జీవితాన్ని బాగా చదువుకుంది. సింహాద్రికి కష్టం లేనిది, ఇష్టంగా ఇచ్చేదే కోరేది. సింహాద్రితో పాటు కష్టమూ పంచుకునేది. నడుము వంగిన తల్లి స్థానంలో తను చేరి ఊళ్ళో పెద్ద ఇళ్ళ పాచి పనులు తీసుకుంది.

"నీకన్నీ తెలుసే!" అనేవాడు సింహాద్రి ఆశ్చర్యంగా. పాపగారనే మాట పెనిమిటికూడా అంటే 'నాకీ జీవితం చాలు' అని తృప్తి పడింది పైడమ్మ.

***

ప్రెసిడెంటుగారి ఇల్లు చేరగానే గుమ్మంలోంచే 'పాపగారూ' అంటూ గట్టిగా పిలుస్తో లోపలికొచ్చింది. వెనుక పెరటిలో నూతి దగ్గర స్నానం చేయిస్తోంది పాప తన చిన్న పాపకు.

"ఎప్పుడొచ్చారు పాపగారు!?" పొంగులువారుతున్న ఆనందంతో అడిగింది పైడమ్మ.

"రాత్రే వచ్చామే."

"పెద్దమ్మగారు అయ్యగారు?"

"లేదు చిన్నయ్యగారు- అంటే మావారు, నేను వచ్చాం. దీనికి అక్షరాభ్యాసం చేయించాలని. నాకు మా తాతగారు అక్షరాభ్యాసం చేసారుట. నేనింతదాన్ని అయ్యానుకదా. తాతగారు మంచం దిగలేకపోయినా సరే ఆయన చేతే నాలుగు అక్షరాలు పాప చెయ్యి పట్టుకుని రాయించాలని నా కోరిక."

"మంచిపని చేసారు పాపగారు. పెద్ద వాళ్ళ దీవెన వుంటే పైకొస్తుంది. చిన్నపాప పేరేంటమ్మా?"

"లక్ష్మి"

"అరే బలేగా వుందమ్మా. మా పిల్ల పేరు కూడా అదే. మహాలక్ష్మి."

"నాతోనే పెరిగావుగా, నీకు నా ఆలోచనలే వచ్చాయి."

"మీరు తప్పుకొండి పాపగారు. చిన్నపాపకు నీళ్ళు నేను పోస్తా" పాపను పక్కకు జరిపి లక్ష్మి చెయ్యి పట్టుకుంది. లక్ష్మి పట్టు వదుల్చుకోవడానికి ప్రయత్నం చేసింది. "నాకొద్దు- నాకొద్దు. మా మమ్మీయే పొయ్యాలి."

"ఏంటమ్మా గారాలు పోతున్నావు. మీ మమ్మీకే నేను నీళ్ళు పోసాను, అన్నం పెట్టాను, అన్నీ చేసాను. ఒక్క నిముషం కదలకుండా వుండండి. మా మహాలక్ష్మిని చూడండి ఎంత కుదురుగా వుంటుందో. నీళ్ళోసుకున్నాకా మా పాపతో ఆడుకుంటారా?"

చిన్న పాప మహాలక్ష్మి వైపు చూసింది. మహాలక్ష్మి సిగ్గుతో తల్లి చెంగు మొహానికడ్డంపెట్టుకుని పరదాలోంచి చిన్న పాపను చూస్తోంది. పైటను మొహానికి గట్టిగా చుట్టుకోవడం వల్ల ముక్కు, పెదాలు, నుదురు, చెక్కిళ్ళు వింత ఆకారాన్ని సృష్టించాయి. చిన్న పాప నవ్వుతో నీళ్ళు చల్లింది.

"అప్పుడే ఫ్రండ్సయిపోయారిద్దరూ. పాపగారూ మనలాగే వీళ్ళు నిముషంలో కలిసిపోయారు చూసారా!" చిన్న పాపను మాటల్లో మరిపించి స్నానం చేయించసాగింది పైడమ్మ.


"సరేగానీ ఎలా వుంది మీ ఆయనతో జీవితం? బాగుందా? అస్తమానం చదువుకుంటాననే దానివి? నాతో చదువయిపోయింది. ఇప్పుడు మీ లక్ష్మితో చదువుతావా!"

పాప హాస్యానికన్నా పైడమ్మకు నవ్వు రాలేదు. "ఏం చదువులోనమ్మా. మా బతుకులు ఇలాగే వుంటాయి. నా పెనిమిటి చాలా మంచాడమ్మా. మా గురించి చాలా కష్టపడతాడు. నేను కూడా కష్టంలో సంతోషాన్ని చూసుకుంటాను. ఏదైనా గొర్రెకు బెత్తెడు తోక అన్నట్లుగానే వుంటుంది మా సంపాదన. మా బతుకులు సరేనమ్మా రేపు మా మహాలక్ష్మి బతుకెలావుంటుందో అనిపిస్తోంది."

"నువ్వేం బెంగ పెట్టుకోకు పైడీ. మీ మహాలక్ష్మీ కూడా మహాలక్ష్మీలాగే బ్రతుకుతుంది. మన పిల్లలిద్దర్నీ చూడు అలా క్షణాల్లో జతకట్టి ఆడుతోంటే మన పాత రోజులు గుర్తుకు రావడం లేదూ! వీళ్ళిద్దరూ కూడా మనలాగే స్నేహితుల్లా వుంటారేమో!"

"అలాగే అనిపిస్తోందమ్మా. నాకు ఒక్కటే సంతోషమమ్మా. మీరెప్పుడూ నన్ను పని మనిషిగా చూడలేదు. మీ ఇంట్లో మనిషిలాగే ఆదరించారు. అందుకేనమ్మా మీరు ఊళ్ళోకొచ్చారని తెలిసి మనసు నిలవక పరిగెత్తుకుని వచ్చాను. నాలుగు రోజులుంటారా అమ్మా?"

"లేదు పైడీ. ఈ రోజు రాత్రికే వెళ్ళాలి. బంధువులింట్లో పెళ్ళికి వెళ్ళి అక్కడినుండి తిరిగి వస్తో ఇలా ఆగాను. ఆఫీసుకు ఎక్కువ రోజులు సెలవు పెట్టలేదు. ఇదిగో దీనికి కాన్వెంటుకూడా మొదలయింది. అన్నట్టు ఒక మాట అడగాలనుకుంటున్నాను. ఇప్పుడు మేము ముంబయ్‌లో వుంటున్నాం, నీకు తెలుసుగా. అటువాళ్ళు, ఇటువాళ్ళు అందరూ దూరమే. ఎవరి జీవితాలు వాళ్ళవిలా వుంటున్నాయి. మా లక్ష్మిని చూసుకోవడానికి ఒక మనిషి కావాలి. అక్కడి మనుషుల మీద నాకు నమ్మకం లేదు. ఈ రోజుల్లో పిల్లని తెలియని వాళ్ళ చేతుల్లో పెట్టి వెళ్ళలేం. నువ్వు బాగా కావలసిన దానివని అడుగుతున్నాను. మీ మహాలక్ష్మిని పంపుతావా? మా వారికి నీ సంగతి చెప్పాను. ఆయనకూడా ఒప్పుకున్నారు. మేం పని వాళ్ళను ఎలా చూసుకుంటామో ఇందాకా నువ్వే చెప్పావు. మీ మహాలక్ష్మిని నా స్నేహితురాలి కూతురుగా అంతకంటే ఎక్కువగానే చూసుకుంటాను. ఏమం



టావు?"

పైడమ్మ వెంటనే సమాధానం చెప్పలేకపోయింది.

"నీ మీద నమ్మకంతో వచ్చాను పైడీ."

"నా పెనిమిటిని కూడా అడగాలి కదమ్మా!"

"నువ్వు చెబితే నీ భర్త కాదనడనే అనుకుంటున్నాను. మీకూ ఆర్థికంగా ఇబ్బంది వుండదు. ఒకసారి ఆలోచించుకుని పంపించండి."

పైడమ్మ మాటలు కరువైనదానిలా తల ఊపి మహాలక్ష్మిని తిరిగి చంకనేసుకుని మరింత ఆప్యాయతతో చేతులతో దగ్గరగా అదుముకుని ఇంటి దారి పట్టింది.

"ఇంత ఆలీసం ఏంటి?" గుమ్మంలో ఎదురు చూస్తోన్న సింహాద్రి అడిగాడు. పైడమ్మ పిల్లని దించి అరుగుమీద చతికిలబడి మొహానికి పట్టిన చమటను పైటకొంగుతో తుడుచుకుంది.

"ఇంతసేపు మీ పాపగారితో కబుర్లేనా? మాట్లాడవేంటే!" పైడమ్మ అప్పటికి జవాబివ్వలేక పోయింది. ఆపులేకుండా మాట్లాడే పైడమ్మ ఇలా మౌనంగా వుందంటే ఏదో జరిగిందనుకున్నాడు సింహాద్రి. మహాలక్ష్మిని చూసి దారిన పోతున్న ఐసుబండివాడు ఆగాడు. సింహాద్రి జేబులోంచి డబ్బులు తియ్యబోతోంటే "ఇప్పుడు కొనద్దు మావా." అని చెయ్యి పుట్టుకుని ఆపింది. మహలక్ష్మి ఏడుపు మొదలుపెట్టింది. అయినా సరే పైడమ్మ కొననియ్యలేదు. ఐసు బండివాడితో బాటు సింహాద్రి కూడా ఆశ్చర్యపోయాడు.

"ఏంటయిందియాల నీకు!"

పైడమ్మ మెల్లిగా నోరు విప్పింది. "మా అయ్య కూడా ఇలాగే రెండయిసులు కొన్నాడు నేను బెంగళూరు వెళ్ళిపోతోన్నప్పుడు."

"అయితే ఏంటి?"

"పాపగారు మనమ్మాయిని పంపమని అడుగుతున్నారు మావా."

"ఏమన్నావు?"

"నిన్నడిగి చెబుతానన్నా. పిల్లని నాలాగే బాగా చూసుకుంటానన్నారు."

"మనకు నెలనెలా డబ్బులిస్తారా?"

"ఇస్తారు-"

సింహాద్రి ఆలోచనల్లో పడ్డాడు. జేబులోంచి చుట్ట తీసి అంటించుకుని 'మళ్ళొస్తా'నంటూ రోడ్డెక్కాడు. మహాలక్ష్మి కూనిరాగం తీస్తోనే చెరువుకేసి వెళ్ళింది. పైడమ్మకు మనసు కుదురు తప్పింది. తను పాపతో వెళ్ళినప్పుడు చిన్నపిల్ల. ఆటకు మరో స్నేహితురాలు దొరికిందన్న ఆనందంతో వెళ్ళిపోయింది. ఇప్పుడు తను అన్నీ తెలిసిన అమ్మ స్థానంలో వుంది. మహాలక్ష్మిని పంపితే ఏమవుతుంది? తన గత జీవితాన్ని బేరీజు వేసుకుని చూసుకుంటే ఈ ప్రశ్నకు సమాధానం దొరకటం లేదు. అస్థిమితంగా ఇంట్లోకి వెళ్ళి ఎసరు పొయ్యమీద వుంచి బియ్యాన్ని కడిగి పోసి మంటను ఎగదోస్తో కూర్చుంది. బియ్యం కుతకుతలాడుతో వుడికి కాసేపటికి అన్నం తయారయింది.

వీధిలోకి వెళ్ళిన సింహాద్రి తిరిగొచ్చాడు మనసు సమాధాన పరచుకుని. "పంపితే పోయిందిగా. నీలాగే ఉన్నన్నాళ్ళు సుకంగా వుంటుంది, చక్కగా అన్నీ నేర్చుకుని వస్తుంది." సింహాద్రి మాటలకు పైడమ్మ తలూపలేదు.

"నువ్వు సుకాలు అనుభవించినప్పుడు లేదు గాని ఇప్పుడు ఆలోచిస్తున్నావేంటి?"

"దాన్ని వదిలి నువ్వు వుండగలవా మావా?"

ఈ ప్రశ్నకు ఒక నిముషం సమాధానం చెప్పలేకపోయాడు సింహాద్రి.

"అన్నీ సదువుకున్నదానివి నువ్వు అలాగంటావేంటి పైడి? మనం ఎవుళం శాశ్వతం! మనలో ఎవళ్ళు సుకపడ్డా సంతోషమేగదా?"

"ఈ మాట మీదుంటావా మావా?"

"పిచ్చిదానా, నేను కాదంటానని బయపడుతున్నావా! ఎవరైనా పైకొస్తారంటే కష్టమైనా తలొగ్గుతానే"

పైడమ్మ కళ్ళు తుడుచుకుని "ఇప్పుడు దానికి ఐసులు కొనిపెట్టుమావా నేను బట్టలు సర్దుతాను."అంది.

సాయింత్రం నాలుగు గంటలకు ముగ్గురూ మునసబుగారింటికొచ్చారు. పాప చాలా సంతోషపడింది. "హమ్మయ్య మహాలక్ష్మిని తీసుకొచ్చావా. పంపవేమోనని భయపడ్డాను. ట్రైనుకు టైం అయిపోతోంది."

"పాపగారు మా మహాలక్ష్మిని పంపడం లేదమ్మా!" సింహాద్రి వులిక్కి పడ్డాడు. పాపకు అర్థం కాలేదు.

"ఏంటి పైడీ. బాగ్ సర్దుకొచ్చారుగా?"

"అవి నా బట్టలు పాపగారు. మీకిష్టమైతే నేనొస్తా. అది కూడా ఒక మాట మీద."

"ఏంటి!?- నువ్వు ఇక్కడ వుండలేకపోతున్నావా?"

"మా మహాలక్ష్మిని మీలాగే పెద్ద చదువులు చదివించండమ్మా. మీరు నెలనెలా డబ్బులివ్వక్కర్లేదు. ఈ ఉపకారం చేసిపెట్టండి. జీవితాంతం మీకు పని చేస్తోవుండిపోతా. అది ఇక్కడుంటే చదువుకుంటుంది. మీ ఇంటిదగ్గరయితే పని చేస్తూ చదువుకోలేదు. నేనెక్కడున్నా దానికి దూరమే కదమ్మా. ఎటొచ్చి పెనిమిటికి కూడా దూరమవుతున్నాను. ఆయనొప్పుకున్నాడు. ఒకళ్ళ సుఖానికి మరొకళ్ళు త్యాగం చెయ్యడం ఆయనకిష్టమేనమ్మా." పైడమ్మ నిర్ణయానికి సింహాద్రి తలవంచాడు.

పాప ఇంట్లోకి వెళ్ళి సూట్‌కేసులో సర్దిన పలక, బలపం ఒక అక్షరాల పుస్తకం తీసుకువచ్చి పైడమ్మ చేతుల్లో పెట్టి "ఇప్పుడు నీ కూతురుకు నువ్వు అక్షరాభ్యాసం చెయ్యి" అంది. పైడమ్మ వాటిని కళ్ళకద్దుకుని మహాలక్ష్మిని వళ్ళో కూర్చోబెట్టుకుని బలపం పట్టించింది 'అ ఆ' దిద్దమ్మా అని రాయిస్తో.

ప్రయాణానికి వేళయింది.

మహాలక్ష్మి రంగుల పుస్తకం కేసి దృష్టిపెట్టి పేజీ తెరచి "ఇదేంటమ్మా?" అంది. "అఆలకు మాటలమ్మా. చూడు అ-అమ్మ, ఆ-ఆవు. బాగా చదువుకో అమ్మా, నే వస్తాను" పైడమ్మ కారుకేసి అడుగలు వేసింది. మహాలక్ష్మి దృష్టి పుస్తకంలోంచి మారలేదు.

*



## ఛా...పార్టీలంటే అసహ్యం!

ముఖం పరమవికారంగా పెట్టి ఈ డైలాగ్ చెబితే ఎవరైనా ఇట్టే నమ్మేస్తారు. ముఖ్యంగా హీరోయిన్లు చెబితే నిజంగా నిజం అని అనుకుంటారు. కానీ త్రిష లాంటి హీరోయిన్ ఈ డైలాగ్ చెబితే నమ్ముతారా ఎవరైనా? అస్సలు నమ్మరు కాక నమ్మరు! టాలీవుడ్, కోలీవుడ్ ప్రేక్షకులకీ, సినీజనానికి త్రిష అంటే ఏమిటో బాగా తెలుసు. రాత్రి సమయాల్లో తాగి నడిరోడ్డు మీద ఆమె ఎంత అల్లరి చేస్తుందో ఇంకా వారు మరిచిపోలేదు. కాకపోతే ఈ డైలాగ్‌ని త్రిష బాలీవుడ్ జనాలకి వినిపిస్తోంది. వారూ పాపం నిజమేనేమో అని నమ్మేస్తున్నారు కూడా! బాలీవుడ్‌లో ఆసిన్‌కి పోటీగా వెళ్ళిన త్రిష ఎలాగైనా సరే అక్కడి వారిని ఆకట్టుకునే ప్రయత్నంలో పడింది. పనిలో పనిగా ఇలాంటి రెండుమూడు డైలాగులతో అక్కడి హీరోల మనసు దోచుకునే పనిలో బిజీగా ఉందని ఇక్కడి వారు అంటున్నారు. త్రిష ఏ ఉద్దేశంతో పై డైలాగ్ చెప్పినా, ఈ సందర్భంగా ఓ సామెత మాత్రం గుర్తుకు రాక మానదు. అదేమిటంటే..."చెప్పేవాడికి వినేవాడు లోకువ..." అని!

**రచయిత సెల్ నెం: 9441735834**